క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



సత్తిబాబు కుటుంబానికి సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: అనారోగ్యంతో బాధపడుతున్న భార్యాభర్తలకు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ సాయం చేశారు. జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌కు చెందిన సవరపు సత్తిబాబుకు ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. అతడి భార్య దుర్గ క్యాన్సర్‌తో బాధపడుతుంది. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్ వారిని పరామర్శించి బియ్యం బస్తా, రూ.2 వేల నగదు అందజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పెట్ల సూర్యనారాయణరాజు, శీలి రాజు, శాల్మన్ రాజు, డేవిడ్ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గాడిమొగలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్యాల బారిన పడకుండా ఉండవచ్చని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవ లక్ష్మి అన్నారు. సోమవారం గాడిమొగలో స్వచ్ఛతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి, పర్యావరణాన్ని కాపాడాలి, ప్లాస్టిక్‌ను నియంత్రించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, కామాడి మాతరాజు, సాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతలో దేశభక్తిని నింపేందుకే సప్తహక్ మిలన్

అమలాపురం టౌన్: యువతలో దేశభక్తిని నింపి హిందూ సంప్రదాయాలపై గౌరవం పెంచేందుకే సప్తహక్ మిలన్ కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహిస్తున్నామని బజరంగ్‌దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు అన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల గీతా మందిరం ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ప్రతిమ వద్ద విశ్వహిందూ పరిషత్ యువజన విభాగం సోమవారం నిర్వహించిన బజరంగ్‌దళ్ సప్తహక్ మిలన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో కురసాల వీరబాబు, మల్లాడి రాధా కృష్ణ, యక్కల బ్రహ్మేష, మేడిశెట్టి నరసింహరావు, అల్లు అజయ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను పరిశుభ్రం చేయించాలి



మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: పట్టణంలో పిచ్చి మొక్కలతో నిండిపోయిన శ్మశాన వాటికలను పరిశుభ్రం చేయించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌కు వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి సోమవారం ఓ వినతి పత్రం అందించారు. శ్మశాన వాటికల్లో కనీస వసతులు కరవవ్వడమే కాకుండా పాములకు ఆవాసాలుగా మారాయని వివరించారు. ముఖ్యంగా స్థానిక కంపోస్ట్ యార్డ్, మున్సిపల్ కాలనీ వెనుక ఉన్న శ్మశాన వాటికల వద్ద దహన సంస్కారాలు చేసేందుకు, స్నానాలు చేసేందుకు సౌకర్యాలు లేవని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ ఆధీనంలో ఉన్న బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద కూడా పారిశుధ్యం లోపించిందని వివరించారు. కార్యక్రమంలో ముస్కూరి ఏసుబాబు, వాసంశెట్టి గణేష్, దంగేటి రామకృష్ణ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

అమలాపురం టౌన్: జిల్లాలో ఇప్పటికే గుర్తించిన వరద ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అల్లవరం మండలం బోడసకుర్రు వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం పర్యటించి బాధితులతో మాట్లాడామన్నారు. జిల్లాలో వరదలు వచ్చినప్పుడల్లా అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా అడుగులేయడం లేదన్నారు. బోడసకుర్రు గ్రామంలో వరద వచ్చినప్పుడల్లా దాదాపు 1100 కుటుంబాలు ముంపు నీటి బారిన పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి భోజనం తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు.



ఎ.వేమవరప్పాడులో ముంపు చేలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



కొత్తలంకలో వరద ఉధృతిపై అధికారులతో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్



పి.మల్లవరంలో కుళ్లిపోయిన వరినాట్లను పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్

ఉగ్రరూపం దాల్చిన గోదావరి

- పొంగిపొర్లుతున్న గౌతమి, వృద్ధ గౌతమి
- లంక గ్రామాల్లోకి ప్రవేశించిన వరద
- ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



గురజాపులంకలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



ఎదుర్లంక వద్ద గోదావరి వరద ఉధృతి

ఐ పోలవరం: గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. ఐ.పోలవరం మండలం చుట్టూ ఉన్న గౌతమి, వృద్ధ గౌతమీ నదీపాయలలో గోదావరి వరద సుడులు తిరుగుతూ ప్రవహిస్తుంది. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సోమవారం అర్ధరాత్రి సమయంలో సుమారు 12.50 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఈ ప్రభావం మండలంపై మంగళవారం ఉదయం నుంచి పడనుంది. ఇప్పటికే గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి కనిపిస్తోంది. సోమవారం సాయంత్రం నాటికే వరద నీరు లోతట్టు లంక గ్రామాల్లోకి ప్రవేశించింది. ఎదుర్లంక బాలయోగి వారధి, మురమళ్ల రాఘవేంద్ర వారధిల వద్ద వరద నీటి మట్టం భారీగా పెరిగింది. అన్నంపల్లి అక్విడెక్టును వరద నీరు తాకింది.

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఐ.పోలవరం మండల పరిధిలో మూడు గ్రామాలపై ప్రత్యక్షంగా వరద ప్రభావం ఉంటుందని అధికారులు గుర్తించారు. కేశనకుర్రులో పల్లెగూడెం, పొగాకులంక, జాంబవానిపేటల్లో వరద నీరు చేరుతోందని అంచనా వేసి స్థానికులను అప్రమత్తం చేశారు. వరద పెరిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు, లేదా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే వృద్ధ గౌతమీ నది మధ్యలో ఉన్న గోగుల్లంక దీవి వద్ద కూడా వరద ఉధృతి ఎక్కువగా ఉంది. ఏటిగట్ల దిగువున ఉన్న పంట పొలాలు, ఆక్వా చెరువుల చుట్టూ వరద నీరు వచ్చి చేరుతోంది. మురమళ్ల, కేశనకుర్రుపాలెం, కొమరగిరి, ఎదుర్లంక, వంటి గ్రామాల్లో ఏటిగట్టు దిగువన అనధికారికంగా సాగు చేస్తున్న రైతులకు వరద పెను ముప్పుగా మారింది. వెనామీ రొయ్యలను హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. ఇక్కడ అధికంగా 40 కౌంట్, 60 కౌంట్ రొయ్యలు ఉన్నాయి. జి.మూలపొలం-పల్లంకుర్రు, గోగుల్లంక-గుత్తెనదీవి, కేశనకుర్రు- కర్రివానిరేవు మధ్య పడవల మీద రాకపోకలు నిలిపేశారు.

ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు

ముమ్మిడివరం: జిల్లాలోని వరద ముంపు గ్రామాల్లో ఆయా మండల ప్రత్యేక అధికారులు, గ్రామ స్థాయి అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ముమ్మిడివరం మండలంలో ముంపు బారిన పడిన లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక ప్రాంతాలను బోటు మీద పయనించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద సోమవారం ఉదయం 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. ముంపు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడితే ముంపు బాధితులను మోటారు బోట్లు, లైఫ్ జాకెట్ల సాయంతో పునరావాస కేంద్రాలకు తరలించి తాగునీరు, భోజన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే ముంపు బారినపడే అవకాశమున్న గ్రామాల్లో గర్భిణులు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సురక్షితంగా సమీప ప్రభుత్వాసుపత్రులకు తరలించామన్నారు. నీట మునిగిన రోడ్లు, వంతెనలకు సంబంధించి గుర్తింపు కోసం పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు జెండాలు ఏర్పాటు చేశారన్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్.మధుసూదన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా అల్లవరం మండలంలో పల్లపు ప్రాంతాలు మునిగే అవకాశం ఉన్నందున మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ కేశవ వర్ధన్ రెడ్డి అన్నారు. బోడసకుర్రులో వరద పరిస్థితిని సోమవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పశువైద్యాధికారి కె.వెంకటరావు, పశుసంవర్ధక శాఖ డీడీ కె.మూర్తి బోడసకుర్రులోని పల్లిపాలెంలో పర్యటించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వరదపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు, మెడికల్ క్యాంప్ ద్వారా వరద ప్రభావిత ప్రాంతంలో వైద్య సేవలు అందించాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకుని వరదలను ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎస్ఐ హరీష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, ఎలక్ట్రికల్ ఏఈ వెంకటేశ్వరరావు, పశు వైద్యాధికారి నారాయణరావు, జేఈ సంపన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. బోడసకుర్రు గ్రామంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శానిటేషన్ నిర్వహించారు. ఆమె వెంట కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

తాళ్లరేవు: గోదావరి వరద హెచ్చరికల నేపథ్యంలో మండల పరిధిలోని పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామంలో కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ మండల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా పశువులకు అవసరమైన దాణా సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు నిరంతరంగా అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ సాయితేజ, పశుసంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ అధికారులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరప్పాడు గ్రామంలో వర్షాల వల్ల ముంపు బారిన పడిన వరి చేలను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు రైతులతో కలిసి సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే డాట్ సెంటర్ సైంటిస్టు ఎం.నంద కిషోర్, డీఆర్‌సీఏడీఏ ఎస్.రాజశేఖర్ జనుపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో ముంపు బారిన పడిన వరి చేలను పరిశీలించారు. చేలలో నుంచి ముంపు నీరు తీసిన వెంటనే ఎకరానికి 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ బూస్టర్ డోసుగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఏ షంషి, మండల వ్యవసాయాధికారి కె.ధర్మ ప్రసాద్, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు

యానాం: గౌతమీ గోదావరికి వరద పోటెత్తుతుండటంతో అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవడానికి సోమవారం ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలైన బాలయోగి కాలనీ, ఓల్డ్ రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలతో పాటు సావిత్రినగర్, గిరియాంపేట, గురుకృష్ణాపురం, టైడల్ లాకు ప్రాంతాల్లో వరద నీరు రావడంతో ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. ఓల్డ్ రాజీవ్‌నగర్ వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద నుంచి వరద నీటిని బయటకు తోడేలా ఇంజిన్లు ఏర్పాట్లు చేశామన్నారు. భీమ్‌నగర్ నుంచి ఓల్డ్ రాజీవ్‌నగర్ వరకూ ఏటిగట్టు వెంబడి పటిష్టతకు ఇసుక బస్తాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. యానాం పట్టణం వెంబడి ఉన్న గోదావరి ఏటిగట్ల పరిరక్షణకు ఇసుక బస్తాలు వేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. వరద ఉధృతి నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆర్ఏఓ మునిస్వామికి సూచించారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన

తాళ్లరేవు: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన వరి చేలను కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ బృందం పరిశీలించింది. మండల పరిధిలోని పి.మల్లవరం, పటవల పంచాయతీల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పటవల ప్రధాన కాలువ, సుంకరపాలెం డ్రైనేజీ పూడికల వల్ల నీరు దిగడం లేదని పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. వరి నారుమడులు, వరి నాట్లు వేశామని, అవి నీట మునిగి కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయితీపై విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులెవరూ అధైర్య పడాల్సిన పని లేదని, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు కె.బాబూరావు, మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.ప్రశాంతి, వీఏఏలు అజయ్‌కుమార్, న్యాయసుధ, యువక్రాంతి, జి.శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం ఎంపీడీఓ కార్యాలయంలో వరదపై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి మూర్తి, వెంకటరావు



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి



ఓల్డ్ రాజీవ్‌నగర్ వద్ద ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఎంపీడీఓను వివరణ కోరిన జెడ్పీటీసీ



ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: ఇటీవల జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో వేదికపై జెడ్పీటీసీ సభ్యుడికి కుర్చీ వేయలేదని, ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఎంపీడీఓ కేవీ ప్రసాద్‌ను జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు వివరణ కోరారు. ఈ విషయంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓతో సమావేశమై మాట్లాడారు. అదే రోజు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు హాజరై సర్వ సభ్య సమావేశానికి రాకపోవడంతోనే కుర్చీ వేయలేదని ఎంపీడీఓ బదులిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతమైతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల చిన్ని పాల్గొన్నారు.

ఓగూరి కుటుంబానికి పరామర్శ



గోపవరంలో సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు తదితరులు

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్‌ను మండలానికి చెందిన పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. విజయ్‌కుమార్ తల్లి ఓగూరి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, కె.ఏడుకొండలు, కాత్రు కృష్ణ, కోటుంలోవరాజు, ఎ.వెంకటకృష్ణారావు తదితరులు సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జెస్సీ

పి.గన్నవరం: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 30వ ఇంటర్ క్లబ్ చాంపియన్‌షిప్ త్వైకాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస క్లబ్ విద్యార్థిని గిడ్డి జెస్సీ లేఖన బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చీఫ్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. జెస్సీ లేఖన పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన విద్యార్థిని. బంగారు పతకం సాధించిన జెస్సీని త్వైకాండో నేషనల్ రిఫరీ, స్టేట్ సెక్రటరీ బి.అర్జునరావు, రిఫరీలు భార్గవి, వినూత్న తదితరులు అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆత్రేయపురం మండలం లొల్లకు చెందిన వాడపల్లి రవికిరణ్ సోమవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను స్వామి శేషావస్త్రాలతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

కష్టజీవులకు వేతన యాతన

- వేతనాలకై ఉపాధి కూలీల ఎదురుచూపులు
- గత 69 రోజులుగా అందని వేతనాలు
- ఒక్క అమలాపురం నియోజకవర్గంలోనే రూ.10.01 కోట్ల పెండింగ్



డి.రావులపాలెంలో డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

అల్లవరం: రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్థితి ఉపాధి కూలీలది. రోజూ కూలి డబ్బులు చేతికి అందితేనే ఇంటిల్లిపాదికీ నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లేది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు కడుపు నింపే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరని పరిస్థితి కనిపిస్తుంది. ఉపాధి లభిస్తున్నా నిర్ణీత సమయానికి వేతనాలు విడుదల కాక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారానికోసారి చొప్పున విడుదలయ్యే వేతనాలు ఏకంగా గత 69 రోజులుగా ఇవ్వకపోవడంతో ఆయా కుటుంబాలకు పూట గడవడమే కష్టమైపోతోంది.

అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ పరిధిలో సుమారు 26 వేల కుటుంబాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరికి ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని కల్పించాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి కాలువల్లో పూడికతీత పనులు, పంట బోదెల నిర్వహణ, ఫారమ్ పాండ్స్ తవ్వకాలు వంటి పనులు చేపట్టారు. ఇప్పటి వరకూ అల్లవరం మండలంలో 326 పనులు, ఉప్పలగుప్తం మండలంలో 977 పనులు, అమలాపురం రూరల్ పరిధిలో 1136 పనులు చేశారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 22 వరకూ చేసిన పనులకు ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించారు. మే 23వ తేదీ నుంచి నేటి వరకూ ఒక్క రుపాయి కూడా ఉపాధి వేతనాన్ని కూలీలకు చెల్లించలేదు. 69 రోజులుగా పెండింగ్ పడిన కూలీల వేతనాలు ఎప్పుడు ఇస్తారో ఉపాధి హామీ అధికారులే చెప్పలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉపాధి కూలీలలకు వేతనాలు చెల్లించలేదు. ఒక్క అమలాపురం నియోజకవర్గంలోనే రూ.10.01 కోట్ల మేర ఉపాధి వేతనాలు రావాల్సి ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. ఈ స్థాయిలో ఉపాధి కూలీల డబ్బులు ఆగిపోవడం ఇదే తొలిసారని కూలీలు చెబుతున్నారు. తమకు రావాల్సిన వేతనాలను త్వరితగతిన విడుదల చేయాలని అధికారులను కోరుతున్నారు. దీనిపై ఉపాధి ఏపీఓ శ్రీనుబాబుని వివరణ కోరగా కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. నిధులు విడుదలైతే వేతనాలు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు.

అమలాపురం నియోజకవర్గంలో కూలీలకు రావాల్సిన వేతనాల బకాయి వివరాలు

మండలం	జాబ్ కార్డులు	ఈ ఏడాది చేసిన పనులు	బకాయిలు (మే 23 నుంచి)
అల్లవరం	9104	326	రూ.1,50,72,450
ఉప్పలగుప్తం	11267	565	రూ.5,27,09,483
అమలాపురం రూరల్	6603	1136	రూ.3,24,00,000

రెండు నెలలుగా వేతనాల్లేవు



ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు రాలేదు. కూలీలేమో డబ్బులు ఎప్పుడు వస్తాయని మమ్మల్ని అడుగుతున్నారు. అధికారులను అడిగితే పైకి పంపించాం వస్తాయి వెయిట్ చేయాలని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి కూలీల వేతనాలను విడుదల చేయాలని కోరుతున్నాం.

– ముషిణి ధనలక్ష్మి, ఉపాధి మేస్త్రి, గోకనవెల్లి

51 రోజులకు వేతనాలు రావాలి



మే 6 తర్వాత చేసిన ఉపాధి పనులకు ఒక్క రూపాయి కూడా వేతనం రాలేదు. 51 రోజులకు రూ.14,840 వేతనాలు రావాల్సి ఉంది. రెండు నెలలు కావస్తున్నా నేటికీ వేతనాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలి.

– చప్పిడి కోకిల, ఉపాధి కూలీ, మొగ్గళ్లమూరు